

11 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి మడకశిర

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో 11 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 4259 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 4055 మంది ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 204 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరు ఓటు హక్కును వినియోగించడం కోసం ఆయా మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుడిబండ, రొళ్ల, అగలి, అమరాపురం మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా మడకశిర మండల కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందనిఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల విభాగం ప్రత్యేక అధికారి మారుతి ప్రసాద్, తహశీల్దార్ బాలాంజనేయులు తెలిపారు.

ఆమెపై ఆగని అఘాయిత్యాలు..!

◆ శిక్షల్లోనూ జాప్యమే ◆ బాధితులకు అందని పరిహారం



మహిళ ఎందులోనూ తక్కువ కాదు... పురుషులతో సమానమే అంటూ వల్లేవేసి మాటలు చేతల్లో కనిపించడం లేదు. ఆమెపై అణిచివేత, అఘాయత్యాలు ఆగడం లేదు. ఒంటరిగా బయటకే కాదు... కుటుంబంలోనూ సురక్షితంగా ఉండలేని దయనీయ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అఘాయిత్యానికి గురైన వారికి అందుతున్న సహకారం, సహాయమూ ప్రభుత్వం వైపు నుంచి నామమాత్రమనే చెప్పాలి. ఇదోరకమైన వివక్ష ప్రభుత్వం వైపు నుంచి ఎదురవుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మహిళలపై రోజురోజుకు హింస పెరుగుతూనే ఉంది. 2021, 2022 సంవత్సరాల్లో చోటు చేసుకున్న నేర గణాంకాలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తాయి. 2021 సంవత్సరలో అనంతపురం జిల్లా పరిదిలో రెండు వరకట్న వేధింపు హత్యలు జరిగితే 2022లో అవి ఆరుకు పెరిగాయి. 2021 సంవత్సరంలో జిల్లాలో జరిగిన మొత్తం కిడ్నాపులు 40 అయితే అందులో 32 మంది మహిళలే కిడ్నాప్ గురైయ్యారు. 2022లో మొత్తం 31 జరిగితే అందులో 28 మంది మహిళలు ఉన్నారు. వరకట్న వేధింపు కేసులు 2021లో 209 జరిగితే, 2022 సంవత్సరంలో 248 నమోదయ్యాయి. ఫోక్సో చట్టం కింద 89 కేసులు నమోదయ్యాయి. ఇలా మహిళలపై అఘాయిత్యాలు అధికంగా ఉంటున్నాయి.



బాధితులకు న్యాయం ఏది. ?

మహిళపై అఘాయిత్యం జరిగితే మూడు వారాల్లోపు శిక్ష పడే విధంగా పాస్టుట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి 2019లోనే ప్రకటించారు. ఈ మేరకు దిశ చట్టాన్ని తీసుకొచ్చారు. కాని ఇవి ఇంతవరకు కార్యరూపం దాల్చలేదనే చెప్పాలి. ఇందుకు జిల్లాలో ధర్మవరం ప్రాంతంలో జరిగిన యువతి అత్యాచారమే ఉదాహరణగా చెప్పవచ్చు. అప్పట్లో ఈఘటన రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చనీయాంశం అయ్యింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో ఆందోళనలను సద్దుమనిచేందుకు ప్రభుత్వం తక్షణం బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని ఇచ్చారు. అయితే ఈ కేసు 2020 డిసెంబరు 24న నమోదు అయ్యింది. ఇప్పటికి రెండేళ్లు పూర్తయినా నిందితులకు ఇంకా శిక్ష పడలేదు. ఈ ఏడాది జనవరిలో ఈ కేసు హియరింగ్‌కు వచ్చింది. ఇది పూర్తయి శిక్ష ఖరారయ్యేందుకు ఇంకెంత సమయం పడుతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమయంలో కొద్ది రోజుల వ్యవధిలో కళ్యాణదుర్గం ప్రాంతంలోనూ ఒక అమ్మాయిపై అత్యాచారం జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులోనూ నిందితులకు ఇప్పటికీ శిక్ష పడలేదు.

కొందిమందికే పరిహారం

పోక్సో చట్టం కింద బాలికలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు వారికి ఆర్థిక తోడ్పాటును అందించి న్యాయం కోసం పోరాడేందుకు సహకారం అందించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంది. డిస్ట్రిక్ లీగల్ సెల్ అథారిటీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఈ బాధ్యతలు నిర్వర్తించాలి. కేసు నమోదయిన సమయంలో బాలికపై జరిగిన అఘాత్య తీవ్రతను బట్టి పరిహారాన్ని రూ.1.50 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పరిహారమివ్వాలని ఉంది. ఇందులో ప్రాథమికంగా 25 శాతమైనా బాధితురాలి కుటుంబానికి అందజేయాలని చట్టం చెబుతోంది. కాని ఉమ్మడి జిల్లాలో చూసినప్పుడు మొత్తం 98 పోక్సో చట్టం కింద కేసులు నమోదై ఉన్నాయి. ఇందులో ఐదారు కేసుల్లో మాత్రమే పరిహారం అందింది. తక్కిన కేసుల్లో ఏ మాత్రం పరిహారం అందని పరిస్థితి ఉంది. 2018 నుంచి ఇప్పటి వరకు అదే పరిస్థితి కొనసాగుతూపోతోంది.

బాధితులకు అండగా నిలవాలి

భానుజ, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి.

సమాజంలో మహిళలపై హింస రోజురోజుకూ పెరుగుతూ పోతోంది. ఇటువంటి సమయాల్లో వాటిని ఎదుర్కొని నిలబడే విధంగా బాధితులుగానున్న వారికి తోడ్పాటు అండనివ్వాల్సిన అవసరముంది. ఆ రకంగా ఉండేందుకు వీలుగా ప్రత్యేకమైన వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాని దురదృష్టం ఆ వ్యవస్థలూ అంతగా బాధితులకు అండగా నిలబడటం లేదేమో అనిపిస్తోంది. పైగా ఇటువంటి వారిపట్ల సమాజంలోనూ ఒకరకమైన వివక్ష, చిన్నచూపు కొనసాగుతుండటం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వాలు బాధితులకు అండగా ఉన్నామని భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

◆ నిబంధనల మేరకు విధులు నిర్వహించాలి ◆ జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పట్టిష్ట ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్ నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మి వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ స్పందన విసి హాల్ నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చైతన్, అడిషనల్ ఎస్పీ రామకష్ణ ప్రసాద్, డీఆర్వో కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, కదిరి ఆర్డీవో రవీంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో శాసన మండలి ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. మార్చి 10 తేదీన రెండో విడత ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు మరో దపా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పోలింగ్ సిబ్బందిని వారి సొంత మండలంలో కానీ, వారు విధులు నిర్వహించే మండలానికి కానీ ఎన్నికల విధులకు కేటాయించలేదని చెప్పారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు భద్రతా ఏర్పాట్లను పూర్తి స్థాయిలో చేసినట్లు చెప్పారు. పుట్టపర్తిలోని చిన్నపల్లె జడ్పీ హైస్కూల్‌లో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్, సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. బ్యాలెట్ బాక్సులకు సంబంధించి గ్రాడ్యుయేట్స్‌కు వైట్, ఉపాధ్యాయులకు పింకు కలర్ క్లాత్ బాగ్‌లు కేటాయించామని తెలిపారు. అంతకు ముందు అనంతపురం ఆర్వో, కలెక్టర్ నాగలక్ష్మి ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పక్కా ప్రణాళికతో ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాల్లో క్షుణ్ణంగా వివరించాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రామాంజనేయులు, డీఆర్డీఏ పీడీ నరసయ్య, ఐఅండ్ పీర్ ఏడీ వేలాయుధం, సిపిఓ విజయ్ కుమార్, హౌసింగ్ అధికారి చంద్రమౌళి రెడ్డి, బ్యాలెట్ బాక్స్ నోడల్ అధికారి బాలాజీతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ ఇతర అధికారులు

‘ఆకలితో అలమటిస్తున్నాం’.!!

◆ కన్నీటి పర్యవంతం అయిన ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ◆ ఎంపిపి ఎదుట సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-ఉరవకొండ

“కడుపు నిండా అన్నం పెట్టడం లేదు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంతోనే కడుపు నింపుకుంటున్నాం. కనీసం మా గురించి పట్టించుకునే వారు ఎవరూ లేరు' అంటూ విడపనకట్లు మండలం గడేకల్ గ్రామ ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హాస్టల్‌లో 5 నుంచి 10వ తరగతికి చెందిన విద్యార్థులు 62 మంది ఉంటున్నారు. హాస్టల్‌లో ఉంటూ గడేకల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా హాస్టల్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వార్డెన్‌తో పాటు సిబ్బంది, ఇక్కడ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. సమయానికి భోజనం లేక ఆకలితో అలమటించే పరిస్థితి నెలకొందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్లో మౌలిక వసతులు కల్పించడంలోనూ నిర్లక్ష్యం కన్పిస్తోంది.

ఎంపిపి ఎదుట సమస్యల ఏకరువు

గడేకల్ హాస్టల్ విద్యార్థులు వారి సమస్యలను ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి ఎదుట ఏకరువు పెట్టారు. ఎంపిపి స్వగ్రామం అదే కావడంతో మంగళవారం నాడు విద్యార్థులు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్‌లో గత పది రోజులుగా అన్నం కూడా సరిగా పెట్టడం లేదన్నారు. ఉదయం టిఫిన్, రాత్రి భోజనం ఏమాత్రం రుచికరంగా ఉండదని, మధ్యాహ్నం సమయంలో ప్రభుత్వ పాఠశాలలో ఇచ్చే అన్నంతోనే కడుపు నింపుకుంటున్నామని చెప్పారు. హాస్టల్‌కు ఇన్‌ఛార్జి వార్డెన్ ఉన్నారని, ఆయన స్థానికంగా ఉండడం లేదన్నారు. ఏదైనా సమస్య ఉంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటూ ఎంపిపి ఎదుట విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఇన్‌ఛార్జి వార్డెన్‌పై ఎంపిపి ఆగ్రహం

విద్యార్థుల సమస్యలను విన్న ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి చలించిపోయారు. వెంటనే వారికి టిఫిన్ తెప్పించి ఆకలి తీర్చారు. అనంతరం ఇన్‌ఛార్జి వార్డెన్ జగన్నాథ్‌ను ఫోన్‌లో సంప్రదించారు. విద్యార్థులకు సరిగా అన్నం పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌కు రాకుండా ఎక్కడో ఉండి విధులు నిర్వహించడం సమంజసం కాదన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకోవడానికి హాస్టల్‌లో ఉంటే వారిపట్ల బాధ్యతా రహితంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో హాస్టల్‌లో సిబ్బంది ఎవరూ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకుని విద్యార్థులకు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలూ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా స్థాయి సోషల్ వెల్ఫేర్ అధికారులతో ఫోన్లో మాట్లాడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఎంపిపి పంపిన టిఫిన్ ప్యాకెట్లను తీసుకుంటున్న గడేకల్ ఎస్సీ హాస్టల్ విద్యార్థులు

ప్రజల పక్షాన నిలబడే పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వండి

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 13న జరుగుతున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ బలపర్చిన అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి పట్లభద్రులతో పాటు ఉద్యోగ ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతు ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలలో జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు ఓటు వేసే ముందు ఆరేళ్ల మన భవిష్యత్ ఉద్యమాల కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదట ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అధికారంలోకి రాక ముందు వైసిపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పార్ట్ టైం ఉద్యోగులకు ఎన్నో హామీలిచ్చిందని గుర్తు చేశారు. అయితే వాటిని ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు కల్పించ లేదన్నారు. పెత్తందారుల పార్టీలు బలపర్చిన వారికి ఓటు వేసే ముందు ప్రతి ఒక్కరు ఆలోచించాలని సూచించారు. సమస్యలను చట్టసభల్లో వినిపించేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల అవసరం ఉందన్నారు. శాసన సభలో 151 మంది ఎమ్మెల్యేలున్న అధికార పార్టీ ఏ రోజూఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల గురించి మాట్లాడలేదని విమర్శించారు. చంద్రబాబు సైతం ఆయన అధికారంలో ఉన్న సమయంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేస్తామని, ఉద్యోగుల సమస్యలను పరిష్కారిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన అనంతరం కమిటీలతో కాలక్షేపం చేశారని విమర్శించారు.

కరాటే పోటీల్లో హరీష్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి హరీష్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు మాస్టర్ అక్బర్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పీలేరు శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో వైట్ బెల్ట్ కటాస్ విభాగంలో జస్వంత్, కుషల్, అభిషేక్, జ్యోతి గోల్డ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. అలాగే వినయ్, వేమంత్, శివశంకర్, లవన్, సమీర్, గణేష్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. శాలిని, వంశీ, భవదీప్ బ్రాంచ్ మెడల్ సాధించారని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ కిరణ్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని, మెడల్‌ను అందజేశారు. ఈసందర్భంగా హరీష్ స్కూల్ ప్రిన్సిపల్ కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల్లో ముందుండాలని సూచించారు. ముఖ్యంగా కరాటే కరాటే వల్ల మానసికంగా శారీరకంగా దృఢంగా ఉంటారని పిల్లల్లో కాన్ఫిడెంట్ లెవెల్‌ని పెరుగుతుందని చెప్పారు. శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ అక్బర్ అలీని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే ఇన్స్‌పెక్టర్ వసుంధర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలను తెలుసుకుని స్వశక్తితో ఎదగాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - హిందూపురం

మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు చేసిన చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకుని స్వశక్తితో మహిళలు ఎదగాలని జీవన జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్, నెహ్రూ యువ కేంద్ర సభ్యురాలు నాగజ్యోతి, పద్మజ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ పద్మజ ప్రసాద్ కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక బిట్ కళాశాలలో మహిళా సదస్సును ప్రిన్సిపల్ రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను చేశాయనిఅయితే వాటిపై అవగాహన లేక పోవడం వల్ల ఎవరు వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదని అన్నారు. ప్రతి మహిళ చట్టాలను సమగ్రంగా ఆర్థం చేసుకోవాలన్నారు. సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలమన్నారు. సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే తీర్చుకోగలగాలన్నారు. ప్రస్తుతం విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలు రంగాల్లో రాణిస్తూ మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులు ఎదగాలన్నారు. మహిళా అధ్యాపకులకు, విద్యార్థినులకు కళాశాల ఛైర్మన్ డాక్టర్. పి చంద్ర మోహన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థినులకు వివిధ పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే బిసిలకు గుర్తింపు : బికె



ఎన్నికైన కమిటీ సభ్యులతో పార్థసారథి, పల్లె రఘునాథరెడ్డి, తదితరులు

ప్రజాశక్తి -పెనుకొండ

బీసీ లకు గుర్తింపునిచ్చిన పార్టీ టీడీపీ నేనని తెలుగుదేశ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి , మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, నాయకులు పూల నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ వాల్మీకి బోయ సాధికారక జిల్లా కమిటీని జిల్లా అధ్యక్షులు,పెనుకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి బి.కె. పార్థసారధి ప్రకటించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వాల్మీకి సాధికార అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులు గా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ,రాష్ట్ర వాల్మీకి సాధికార కన్వీనర్ పూల నాగరాజు లు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం నందమూరి తారకరామారావు టిడిపి పార్టీని స్థాపించారన్నారు. నాటి నుండి నేటి వరకు తెలుగుదేశం పార్టీలో ఎంతోమంది బీసీ నాయకులు రాజ్యాధికారాన్ని అనుభవించారన్నారు. టిడిపి అంటేనే బిసిలు అని అన్నారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా మంత్రులుగా, ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా,జడ్పీ ఛైర్మన్లుగా అవకాశం కల్పించారని తెలిపారు. అయితే ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీలకు ఉపయోగం లేని పదవులు ఇచ్చి ఉన్నతమైన పదవులను ఒకే సామాజిక వర్గానికి ఇచ్చారని విమర్శించారు. టిడిపితోనే సాధ్యమని తెలిపారు. జిల్లాలో జరగనున్న నారా లోకేష్ యువ గళం పాదయాత్రను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా బోయ అనిల్ కుమార్, సానిపల్లి వెంకటేష్,సంగప్ప, నాగరాజు, చలపతి, శ్రీరాములు, శంకరప్ప, ఈశ్వరయ్య, కేశవయ్య, నరసింహప్ప, రాజేంద్రప్ప, రమేష్, నరసింహులు, నాగరాజు, నాగేంద్ర, రవీంద్ర, క్రిష్టప్ప, వెంకటేష్, నాగభూషణను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగయ్య, చిన్నవెంకటరాముడు, కేశవయ్య, కురుబ కృష్ణమూర్తి, చిన్నప్పయ్య, బోయ నాగరాజు, లక్ష్మినారాయణ రెడ్డి, నరహరి, అదిశేషు, చంద్ర, టిడిపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్ర రూట్‌మ్యాప్ పరిశీలన

తనకల్లు : మండల పరిధిలోని చీకటిమాని పల్లి వద్ద శ్రీ అన్నమయ్య జిల్లా నుండి శ్రీ సత్య సాయి జిల్లాలోకి ఈ నెల 17వ తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో టిడిపి కదిరి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ కార్యక్రమాలు నిర్వహించడానికి స్థల పరిశీలన చేశారు. చీకటిమానిపల్లి వద్ద రాత్రి విడది చేసే స్థలాన్ని పరిశీలిం ఆరోజు ఉదయం 10 గంటలకు పాదయాత్ర ప్రారంభమై చీకటి మానిపల్లి, గంగసానిపల్లి, నారే వాండ్లపల్లి మీదుగా కొక్కంటి క్రాస్ చేరుకుంటుందని, అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారని, ఈ కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని కందికుంట వెంకటప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, కో కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి, సీనియర్ నాయకులు దేశాయి ప్రభాకర్ రెడ్డి, సోంపాలెం నాగభూషణం, మాజీ జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, నాగేంద్రప్రసాద్, మహబూబ్ బాషా, గోపీనాథ్, మహేష్, బీసీ నాయకులు శంకర్ నాయుడు, ఎస్సీ సెల్ చిన్నప్ప, ఓబులేసు, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రూట్ మ్యాప్‌ను కదిరి మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర ఏర్పాట్లపై చర్చిస్తున్న ‘కందికుంట’


పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

నిత్యావసర సరుకులు పంపిణీ

కొత్తచెరువు : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న నిరుపేదలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు పౌష్టిక ఆహారాన్ని ఆర్డీటీ కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరసప్ప, ఆర్‌డిటి ఎటిఎల్ సుధాకర్ మంగళవారం పంపిణీ చేశారు మండలాల నుండి 60 మంది పేద రోగులను గుర్తించి వారికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి

పుట్టపర్తి రూరల్: 30 సంవత్సరాల దాటిన ప్రతి ఒక్కరు రోజూ వ్యాయామం చేసి మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకున్నప్పుడే వ్యాధులు నియంత్రణలో ఉంటాయని శ్రీ సత్య సాయి జిల్లా వైద్యాధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిధిలోని పెడపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అండ్ జన ఔషధి దివాస్ కార్యక్రమం నిర్వహించారు. రక్త పోటు, మధుమేహం నియంత్రణ కార్యక్రమాన్ని పరిశీలించారు. 30 సంవత్సరాలు దాటినవారు తరచూ రక్త పరీక్షలు చేయించుకొని మధుమేహం, రక్తపోటు వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. ప్రతి రోజు రోజు వ్యాయామం చేసి, మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకుని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్య వంతమైన జీవనం గడపవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ నగేష్, వైద్యసిబ్బంది రాధ, సుస్మితా, ఆశా కార్యకర్తలు పద్మావతి, వాణి బాయి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

కదిరి అర్బన్ వైసిపి అభివృద్ధికి కృషి చేస్తానని సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జి డికె. బాబు (సి. కృష్ణారెడ్డి) పేర్కొన్నారు. వైసిపి సేవాదళ్ విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా నియమితులైన తలుపుల మేజర్ పంచాయతీ వైస్ సర్పంచి సి. కృష్ణారెడ్డి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డికె. బాబును అభినందించారు. అనంతరం డికె. బాబు మాట్లాడుతూ పార్టీలో తనను గుర్తించి బాధ్యతలు అప్పగించినందుకు జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షులుగా షాజహాన్

కొత్తచెరువు : శ్రీ సత్య సాయి జిల్లా వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షులుగా కొత్తచెరువుకు చెందిన మైనార్టీ నాయకుడు కెఎ. షాజహాన్‌ను నియమించినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి ఈ సందర్భంగా షాజహాన్ మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని అన్నారు. అనంతరం మైనార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిని కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, మన్నేరి ప్రసాదు, గిరిబాబు, మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు రెడ్డప్ప రెడ్డి, నాగరాజు, సుబ్బారావు, మటన్ శంకర్, రెడ్ దర్గా కమిటీ చైర్మన్ అత్తాపూర్ రహిమాన్, ఎంపీటీసీ రఫీ అజీజ్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

బత్తలపల్లి : మండల కేంద్రమైన బత్తలపల్లిలోనూ, పలు గ్రామాలలో మంగళవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ ఆనందోత్సవాలను జరుపుకున్నారు. మండలంలోని పత్యాపురం తండాలు, సంగాల తండాల్లో గిరిజనులు హోలీ పండుగను వైభవంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్డీటీ ప్రాంగణంలోనూ రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి

అనంతపురం : ఆర్టీసీ కార్గో రవాణా, ఆదాయం పెంచి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సూచించారు. మంగళవారం నగరంలోని రీజినల్ కార్యాలయంలో అనంతపురం రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బస్ సర్వీసు పనితీరును సమీక్షించడంతోపాటు సెక్టార్ వారీగా పనితీరు బాగా లేని సర్వీసులను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు. అలాగే కార్గోలో స్వీకరించిన వస్తువులను వెంటనే డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కెఎంపిఎస్ పెంచాలని, బ్రేక్‌డౌన్‌లను తగ్గించి ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే ప్రమాదాల నివారణకు డ్రైవర్లందరికీ అవగాహన కల్పించి ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో పిఎంఇ మోహన్‌కుమార్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను నియమించండి : సిపిఎం

ఆత్మకూరు : మండలానికి వెంటనే తహశీల్దార్‌ను నియమించాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న తహశీల్దార్ నాగభూషణ ఆరోగ్య సమస్యలతో సెలవుపై వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ పరంగా ఏ పని కావాలన్నా జరగడం లేదన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తహశీల్దార్‌ను నియమించాలని కోరారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళి

అనంతపురం కలెక్టరేట్ : గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని జిల్లా గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో అయ్యాంకి పాత్ర చాలా గొప్పదన్నారు. అంతేగాకుండా ఆయన గొప్ప సాహితీ వేత్తగా, గ్రంథాలయ సర్వస్వం పత్రికను ప్రారంభించి గ్రంథాలయాల ఉనికిని చాటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, లైబ్రేరియన్లు ఇంతియాజ్, హేమమ్మలిని, రామాంజనమ్మ, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

చిలమత్తూరు : కనుమ లక్ష్మినరసింహ స్వామి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. మండల కేంద్రంలోని లక్ష్మినరసింహస్వామి దేవాలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. మూలవిరాట్‌ను రథం పై ఉంచి మండల ప్రధాన రహదారిపై రథోత్సవం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సిఐ వేణుగోపాల్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ ఇక్బాల్, టిడిపి నాయకులు అంబికా లక్ష్మినారాయణ, వైసిపి నాయకులురాలు మధుమతీరెడ్డి తదితరులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న జనం

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ


స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్. ఈనెల 13 న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పుట్టపర్తి పట్టణ పరిధిలోని చెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగు రూం, కౌంటింగు హాలును ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ మంగళవారం పరిశీలించారు. అనంతరం పుట్టపర్తి , కొత్తచెరువులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కౌంటింగు రోజున స్ట్రాంగ్ రూం వద్ద చేపట్టాల్సిన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, తదితర చర్యలపై స్థానిక పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగంతో కలసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్ట్రాంగు రూంల వద్ద సాయుధ బలగాలచే గార్డు నిర్వహించాలని స్ట్రాంగు రూం, కౌంటింగు కేంద్రాల పరిసరాలు కవర్ అయ్యేలా సి.సి కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి. రామకృష్ణ ప్రసాద్, డీఎస్పీ యశ్వంత్, పట్టణ సిఐ బాల సుబ్రమణ్యం రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు : ఈనెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలని రెవెన్యూ పోలీస్ అధికారులకు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ సూచించారు. కొత్తచెరువులోని బాలికలు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు. మూడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి భారీ కేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కెవి. రామకృష్ణప్రసాద్, డీఎస్పీ యశ్వంత్, సిఐ జయ నాయక్, తహశీల్దార్ రామాంజనేయ రెడ్డి, ఎస్ఐ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో జర్నలిజం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పెనుకొండ

ఎస్కే యూనివర్సిటీ ఇటీవల ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో పట్టణంలోని పిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు జర్నలిజం గ్రూపులో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలం రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ అనుమతితో 2020-21 విద్యా సంవత్సరానికి నూతనంగా కళాశాలకు కేటాయించిన బిఎ జర్నలిజం కోర్సులో గత నాలుగు సెమిస్టర్లలోనూ వరుసగా వందశాతం ఉత్తీర్ణత సాధించిన జర్నలిజం విద్యార్థులను అభినందిస్తున్నట్లు తెలిపారు. సత్యసాయి జిల్లాలో కేవలం పెనుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాత్రమే జర్నలిజం కోర్స్ అందుబాటులో ఉందన్నారు. ఏదైనా ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సును సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుని పొందాలనికోరారు. నాలుగు సెమిస్టర్లలోనూ వందశాతం జర్నలిజం ఫలితాల ఉత్తీర్ణతకు కృషిచేసిన అధ్యాపకులు రంగనాయకులు, గంగరాజును ప్రిన్సిపల్ అభినందించారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. జయప్ప, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ కె. హరీష్‌బాబు, ఆర్ట్స్ విభాగపు ఇన్‌ఛార్జి డాక్టర్ కె. ప్రతాప్‌ను అభినందించారు.


కొల్లకుంటలో వైద్య సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

కొల్లకుంటలో ఉచిత వైద్య సేవలు

హిందూపురం : పట్టణ పరిధిలోని ఒకటవ వార్డు కొల్లకుంటలో ఎన్టీఆర్ ఆరోగ్య రథంతో ఆ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా 281 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప మాట్లాడుతు పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే బాలయ్య సంచార ఆరోగ్య రథాన్ని ఏర్పాటు చేసి పట్టణం నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రశేఖర్, రామాంజి, అశ్వర్థ, రంగప్ప, కిష్టప్ప, నంజుండ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్‌గా రాష్ట్రం : ఎమ్మెల్సీ ఇక్బాల్


కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్, పాల్గొన్న ఎమ్మెల్సీ, తదితరులు

ప్రజాశక్తి- సోమందేపల్లి

ప్రభుత్వ నిర్వహిచిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావటంపై వైసిపి జిల్లా అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం స్థానిక నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాఖలో రెండు రోజులు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పెట్టుబడిదార్ల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. దాదాపు 352 ఎంఒయులు, రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, 6 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పనకు విశాఖ వేదిక కావడం సంతోషకర విషయమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, యువత ఉపాధికి ఇది దోహద పడుతుందనిఅంతే కాకుండా రాష్ట్ర ఆర్థిక స్థితి కూడా మరింత బల పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, జెడ్పీటీసీ డిసి అశోక్, ఉపసర్పంచి వేణు, సింగల్ విండో చైర్మన్ కొల్లప్ప, డీలర్ రవీందర్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, రామాంజనేయులు తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ సక్సెస్‌తో రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల మేర పెట్టుబడులు తరలి రావటంతో ఇప్పుడు దేశం మొత్తం ఎపి వైపు చూస్తోందని ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జిఐఎస్) విజయవంతం కావడంతో ఎమ్మెల్సీ తమ కార్యాలయంలో వైసిపి నాయకులతో కలసి కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లా, నాయకులు లతీఫ్ సేట్ తదితరులు పాల్గొన్నారు.

కాపుల అభివృద్ధే సంక్షేమసేన ధ్యేయం

పుట్టపర్తి అర్బన్ : కాపుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాపు సంక్షేమ సేన పనిచేస్తుందని ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ గ్రంధి దివాకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలో జిల్లా కాపు బలిజల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజల వెనుకబాటు తనం, విద్య, వైద్య, నిరుద్యోగ పరిష్కారంతోపాటు రాజ్యాధికారం కోసం బలిజలలో చైతన్యం రావాలన్నారు. ఆ దిశగా ఎన్నికల మేనిఫెస్టోలో బలిజల బాగు కోసం అభివృద్ధి కోసం నిర్దిష్టమైన ప్రణాళికలు పొందుపరచాలని డిమాండ్ చేశారు. కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు ఆ దిశగా అడుగులు వేస్తూ ఈనెల 12న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. అనంతరం కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షులుగా బొగ్గరం శ్రీనివాసులును ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ అధ్యక్షులు శ్యామ్ కుమార్, గౌరవ అధ్యక్షులు వెంకటనారాయణ, నాయకులు జగదీష్, కుమార్, నరసింహమూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మడకశిర: పట్టణంలోని శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు ప్రాజెక్టు అధికారిని నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం నుండి అమరాపురం బస్టాండ్ వరకు అంగన్వాడీ ఉద్యోగులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిడిపిఒ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ఆడపిల్లలను అన్ని రంగాలలో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఆడపిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకురావాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు..


ర్యాలీలో పాల్గొన్న అంగన్వాడీలు, తదితరులు

టీచర్ల ఆత్మస్థైర్యం దెబ్బతీస్తే సహించం : యుటిఎఫ్


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి మడకశిర

ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తే సత్ఫలితాలు వస్తాయని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఇది గుర్తించాలని ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్) జిల్లా అధ్యక్షులు జయచంద్రా రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యటనల పేరుతో ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యంకోల్పోయేలా వ్యవహరిస్తే కచ్చితంగా ప్రవీణ్ ప్రకాశ్ పర్యటనలను అడ్డుకోవాలని, బహిష్కరించాలని పిలుపునిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం మడకశిరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలైన ఉపాధ్యాయులు రోడ్డెక్కకుండా చేయడానికే ప్రభుత్వం ప్రవీణ్ ప్రకాశ్‌ను పాఠశాల విద్యాశాఖకు తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. విద్యారంగం బలోపేతానికి, సంస్కరణల అమలుకు విశాఖ సదస్సులో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించాలని డిమాండ్ చేసారు. అదేవిధంగా ఎంఎల్‌సి ఎన్నికల రోజును సెలవు దినంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించారని గుర్తు చేసారు. దీనిని అనుసరించి జిల్లా అధికారులు కూడా అదే రోజును ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యా సంస్థలకు సెలవు దినంగా ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శులు నారాయణ స్వామి, హరికృష్ణ, మండల నాయకులు మహాలింగప్ప, నరసింహప్ప, ముద్దగిరియప్ప, జోగప్ప, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య క్షేత్రానికి చేరుకున్న 'ప్రభ'

బత్తలపల్లి : కాటి కోటేశ్వరక్షేత్రంలో మూడు రోజులు పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాటమయ్య స్వామి ప్రభను మంగళవారం రాత్రి పది గంటలకు క్షేత్రానికి తరలించారు. మండలంలోని సంజీవపురం గ్రామ సమీపంలోని కాటి కోటేశ్వరక్షేత్రంలో కాటమయ్య స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం స్వామి మూలస్థానమైన ఈదుల ముష్టూరు గ్రామం నుండి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమలో ఆలయ ధర్మకర్తలు రాజగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచి నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సూర్యప్రకాష్ రావుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రహ్మగరుడసేవ వాహనంపై ఖాద్రీశుడు


సంగీత వాయిద్యకారుల విన్యాసాలు

ప్రజాశక్తి కదిరి అర్బన్

బ్రహ్మ గరుడ వాహనంపై ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి తిరువీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారికి బ్రహ్మ గరుడసేవ నిర్వహించారు. ఈ ఉత్సవానికి అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుడిని ఖాద్రి లక్ష్మీనరసింహస్వామికి వాహనంగా పంపుతారని భక్తుల విశ్వాసం. అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మ గరుడు సేవా అని పిలుస్తారు. స్వామివారి ఉత్సవానికి కుటాగుళ్ల గ్రామానికి చెందిన నారాయణ శెట్టి వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వచ్చారు. మంగళవారం ఉదయం స్వామివారికి నిత్య పూజలు ప్రత్యేక అలంకరణ, హోమాలు, అనంతరం శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. మధ్యసాయంకాలం గరుడ దండం ప్రతిష్టించి ,తరువాత శ్రీవారిని తిరువీధుల్లో ఊరేగించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ఆవరణములో కళ్యాణ వేదికపై కళాకారులు పలు రూపాలలో నాట్యాలను ప్రదర్శించి సుధీర ప్రాంతాల నుంచి వచ్చిన ఖాద్రీ నరసింహస్వామి భక్తులను ఆకట్టుకున్నారు. స్వామివారి ఊరేగింపు సమయంలో నాదస్వర మంగళ వాయిద్యాలను సంగీత ప్రియులు విని ఆనందపడ్డారు. ఉత్సవాలలో మంగళ వాయిద్యాలు ప్రాముఖ్యతను పెంచుతుందని భక్తులు మనోభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. రోజుకొక రకమైన నాదస్వర విద్వాంసులను సుదీర ప్రాంతాల నుంచి పిలిపించి నాదస్వర కచేరీలను నిర్వహిస్తున్న ఓబుల దేవర చెరువు మండల కేంద్రానికి చెందిన డోలు విద్వాంసుడు నరసింహులను కదిరి పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని అంతా ఆలయ ఈవో గురు ప్రసాద్ పాలకమండలి చైర్మన్ జరిపిటి గోపాలకృష్ణ కమిటీ సభ్యుల సహకారంతో నిర్వహిస్తున్నామని స్వామివారి భక్తులు డోలు విద్వాంసుడు నరసింహులు తెలిపారు. ఈ ఉత్సవాలలో పాలక మండలి చైర్మన్ జరిపిటి గోపాలకృష్ణ, ఆలయ కార్య నిర్వహణ అధికారి పట్నం గురు ప్రసాద్, కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు శేష వాహనం : కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం 7 రోజు శేష వాహనంపై ఖాద్రీ నరసింహుడు విహరిస్తారని ప్రధాన అర్చకులు నరసింహ రావు, కుమార్ స్వామి తెలిపారు. ఉభయ దారులుగా పట్టణ నివాసులు యాదాళం శంకర్ నారాయణ, శ్రీనివాసులు వారి కుటుంబ సభ్యులు పాల్గొంటారని వారి తెలిపారు.

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

బత్తలపల్లి : ప్రజల నుంచి అక్రమంగా సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న 25 ప్యాకెట్ల ప్రజా పంపిణీ బియాన్ని బత్తలపల్లి ఎస్ఐ శ్రీహర్ష తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. మండలంలోని యర్రాయపల్లిలో రేషన్ బియ్యంను సేకరించి బ్లాక్ మార్కెట్ కు అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో మంగళవారం అనంతపురం కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని యర్రయపల్లి క్రాస్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఆటోని నిలిపి తనిఖీలు చేయగా అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గమనించారు. ఆటోను అదుపులోకి తీసుకుని 25 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని సంగాల గ్రామానికి చెందిన గుజ్జల శివశంకర్ ప్రజా పంపిణీ బియ్యాన్ని ప్రజల వద్ద నుంచి సేకరించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించడానికి వెళుతున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సోమశేఖరమూర్తి, రామలింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత

పుట్టపర్తి రూరల్ : చోరీకి గురైన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్లు చోరీకి గురైన బాధితుల ఫిర్యాదు మేరకు రికవరీ చేసిన 42 సెల్‌ఫోన్లను జిల్లా కేంద్రం లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ బాధితులకు మంగళవారం అందజేశారు. వీటి విలువ రూ. 5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 162 సెల్‌ఫోన్లు బాధితులకు అందజేశామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి రామకృష్ణ ప్రసాద్, డీఎస్పీ యశ్వంత్, పుట్టపర్తి పట్టణ సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, దిశ సిఐ లక్ష్మన్న, టెక్నికల్ ఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు క్యాట్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసులు అందజేసిన సెల్‌ఫోన్లను చూపుతున్న బాధితులు

స్తంభం విరిగిపడి వ్యక్తి మృతి

నార్పల : మండల పరిధిలోని కేశేపల్లి గ్రామంలో చౌడేశ్వరి గుడి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభం విరిగిపడి కూలీ గోపి (28) మృతిచెందినట్లు ఎస్ఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... పొట్టకూటి కోసం చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన కూలి పని చేసుకునే గోపీ కేశేపల్లిలో నిర్మించే ఆలయ నిర్మాణ పనులకు వచ్చాడు. ఇందులో భాగంగా మంగళవారం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభం విరిగిపడి కింద పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గోపీ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని స్థానికులు కోరారు.

వేరుశనగ వామికి నిప్పు

శింగనమల : మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గాజుల శ్రీనివాసులు, గాజుల ప్రసాద్‌కు చెందిన వేరుశనగ వామి పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. పశుగ్రాసం నిమిత్తం వామిగా ఏర్పాటు చేసుకున్న వేరుశనకు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమై సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్‌సిబ్బంది మంటలను అదుపు చేశారు. వేరుశనగ వామికి నిప్పు పెట్టిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు.

రెండుటన్నుల ప్లాస్టిక్ వస్తువులు సీజ్

అనంతపురం కార్పొరేషన్ : కంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం మేరకు నగరంలో రెండు టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసినట్లు నగరపాలక సంస్థ కార్యదర్శి సంఘం శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్రటరీ, హెల్త్ ఆఫీసర్ కె.గంగాధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది అధ్వర్యంలో మంగళవారం నగరంలోని శ్రీకంఠం సర్కిల్ సమీపంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలు, కూరగాయలు, పూల మార్కెట్లలో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదన్నారు. అయినా పలు దుకాణాల్లో ప్లాస్టిక్ వాడుతుండటంతో దాడు చేసి సీజ్ చేయడంతోపాటు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు తిప్పేస్వామి, ఇస్మాయిల్, ప్రతాప్, కేధార్, శంకర్, గంగాధర్, మహిళా పోలీసులు సుకన్య, దీప్తి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ పెంపొందించుకోవాలి

పెనుకొండ : విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ, అంకిత భావం, సేవాగుణం పెంపొందించుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ సత్య సాయి జూనియర్ కళాశాలలో జూనియర్ విద్యార్థులు, సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ శ్రద్ధగా చదివితే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ఎస్ఒ ప్రతాప్, ఎఒ కేశవయ్య, ప్రిన్సిపల్ గంగాధర్, అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న 'పల్లె'

సైనిక్ ఫలితాల్లో కెఎల్ఎన్ విద్యార్థుల ప్రతిభ

కదిరి టౌన్ : కర్నాటక రాష్ట్రంలోని కిట్టూరు రాణి చెన్నమ్మ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో స్థానిక కెఎల్ఎన్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు నవోదయ కోచింగ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ సోమవారం విడుదలైన సైనిక్ స్కూల్ ఫలితాల్లో తమ ఇన్స్టిట్యూట్ కు చెందిన 19 మంది విద్యార్థులు పరీక్ష రాశారని. అందులో 17 మంది విద్యార్థులు సీట్లు సాధించారన్నారు. వర్షిత, లాస్య ప్రియ, చైత్ర, కుందన శ్రీ, చిన్మయి, కార్తీక, సాయి ప్రణతి, నవనీత, దీప్తిజ్ఞా, హర్షిని, తేజశ్రీ, హేమ శ్రీ, మోగ్న, తదితర విద్యార్థులు టాప్ మెరిట్‌లో సీట్లు సాధించారని రమేష్ తెలిపారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు.


ప్రతిభ కనపర్చిన విద్యార్థినులు